# అక్షింతలు

"కాంతం! చూశావటే మన ప్రఫుల్లకి కథానికల పోటీలో ప్రథమ బహుమతి వచ్చిందట!" అని హుషారుగా వంటింట్లో ఏవో చక్కబెట్టుకుంటున్న సతీమణితో చెప్పడానికి వెళ్ళారు ప్రభాకరం గారు.

"ఆ మరి ఆవిడ ఇంట్లో వెలగబెట్టే పనేమిటి! అమర్చి పెట్టేవాళ్ళు మర్చిపెడుతూ వుంటే తీరిగ్గా కూచుని కథలు రాయడం తప్ప. బియ్యే పాసై మూడేళ్ళయింది. ఆ దేరి పదేళ్ళయింది. ఇంట్లో పూచిక పుల్ల పని చెయ్యాలా? ఊళ్ళో ఉద్యోగం చేసి నయాపైసా సంపాయించాలా?" బుస కొట్టింది కాంతం.

ఇదేమిటి ఇవాళ దీని ధోరణి ఇలా సుతి మించిపోతూ వుందని- "అదేమిటే అలా గంటావు. ఆ ఒక్క కథకీ దానికి మూడు వందల రూపాయిలిస్తారు" అన్నారు ప్రభాకరం గారు.

"మూడొందలే! ఒక్క కథకి! ఏమంత కష్ట పడి పోయిందని! అదంతా ఆవిడ యథాస్నే కొడతారా? మీరు కథలు రాసి అందుకే ఆవిడ పేరు పెడుతున్నారన్న మాట- నా పేరు పెడితే అదంతా ఎక్కడ నా వాళ్ళో వొరిగి పోతుందేమోనని" తారాస్థాయికి వెళ్తోంది కాంతమ్మ ధోరణి.

"ఛీ రసం లేని మనిషి నేరక తెచ్చాను ప్రసంగం దీనితో" అని చీదరించుకుని వెళ్ళిపోయారు ప్రభాకరం గారు.

మర్నాడు సాయంత్రం ప్రఫుల్ల, మహేంద్ర సినిమాకి వెళ్ళారు. కాంతం పేరంటానికి వెళ్ళింది. ప్రశాంతంగా వుందని ప్రభాకరం గారు వసారాలో వాలుకుర్చీలో కూచుని ధూమపానం చేస్తూ పద్య రచన మొదలెట్టారు. దుష్కరి ప్రాసంతా వచ్చింది కాంతమ్మ వాయనం పట్టుకొస్తూ.

చీర మార్చుకొని ఫ్లాస్కులోని కాఫీ కప్పులో పోసి భర్త కందిస్తూ తాను ఆ వాలుకుర్చీ పక్కనే స్తంభానికి చేరబడి కూచుంది. వాయనం మూట విప్పి కిళ్ళీ కూడ అందించింది.

'ఎప్పుడూ లేనిది కాంతమ్మ శాంతంగా ఇవాళ ఏమి టింత ఆప్యాయత వొలకబోస్తోంది చెప్మా?' అని విస్తుపోతు న్నారు ప్రభాకరం గారు.

మెల్లగా తన స్వయంపాకపు మూట విప్పింది కాంతమ్మ.

"ఏమండీ నా పేరుతో ఓ కథ రాసి పత్రికకి పంపగూడదటండీ!" ఒక ప్రసిద్ధ కథకుడైన భర్తతో-

భార్య: ఏమండీ నా పేరుతో ఒక కథ రాసి పత్రికకి పంపగూడదటండీ

భర్త: నీ పేరుతో నేను వ్రాయడమేమిటి? తప్పు కాదటే?

భార్య: ఆ- తప్పు! ఈ రోజుల్లో ఆడవాళ్ళ పేర్లతో పత్రికల్లో ఇన్ని కథలు పడుతున్నాయి కదా! నిజంగా ఇవన్నీ వాళ్ళు వ్రాసినవేనా? వాళ్ళ మొగుళ్ళు వ్రాసేస్తున్నారని నా అనుమానం.

భర్త: సీత సీత! మీ జాతి శక్తినే నువ్వు శంకిస్తున్నావన్న మాట. స్త్రీ శక్తిస్వరూపిణి 'కొందరలాంటివాళ్ళున్న ఈనాడు నిజంగా చాలామంది ఆడపిల్లలు స్వతంత్రంగా వ్రాస్తున్నారు. వాళ్ళలో చాలామంది అవివాహితలు కూడా వున్నారు. నువ్వసలు వ్రాయడానికి ప్రయత్నం చెయ్యి. నేను దిద్ది పంపిస్తాను-కావలిస్తే నా కేరాఫ్‌తో. పోనీ కనీసం కథ నువ్వు ఆలోచించి చెప్పు రచన నేను చేస్తాను. ప్రధానమైన సృష్టి కొంతయినా నువ్వు చేసినట్లవుతుంది.

భార్య: ఒకవేళ రచన కూడా నేను స్వతంత్రంగా చేసినా ప్రసిద్ధ కథకులైన మీ భార్యను కావడం వల్ల నేను రాసినట్లు లోకం నమ్మదుగదండీ.

భర్త: అయితే మరెందుకు నన్నిలా ఇబ్బంది పెడతావు?

భార్య: అదే నా ఉద్దేశమున్నూ. నేనే రాసినా లోకం నమ్మదు. కనుకనే మరి అనవసరంగా ఆ శ్రమ నేనెందుకు పడడం అని. అయితే మీరు మారుపేరు పెట్టుకొని రాస్తుంటారు.

## యస్వీ జోగారావు

కాబట్టే తెలీని కొంతమంది దగ్గర అంటే కనీసం ఈ చుట్టు పక్కల మా ఆడవాళ్ళ సొసైటీలోనైనా నాకు పలుకుబడి కాస్త హెచ్చుతుంది. పోనీ యిదీ ఒక సరదా అనుకుందురూ. నా ముచ్చట ఆ మాత్రం తీరుస్తే తప్పా? ఆ సుబ్బరాజు గారి శకుంతలను చూశారూ మిడిసిపడి పోతోంది. ఊళ్ళో అన్ని మీటింగుల్లోనూ ఇదే- ఉపన్యాసాలకని, బహుమతి ప్రదానాల కని.కథలు రాస్తానేగా ఆ మిడిసిపాటు. ఈవేళ ఆ పేరంటం దగ్గర అందరూ దాని మాటే చెప్పుకున్నారు.

భర్త: ఓహో అదా సంగతి! సరే నీకో ఉపాయం చెబుతాను -చూ. చూడు పత్రికల్లో మారుపేర్లు చెప్పుకుని రాస్తుం టారు కొందరు. ఆడపేర్లతో కొందరు మొగాళ్ళే రాస్తు న్నారు. మంచి ముహూర్తం చూసుకుని ఫలానా మారు పేరు నాదేనని ప్రచారం మొదలెట్టు.

భార్య: అలాంటివి నాకు చేతకావు గాని, ఇంతకీ నా పేరుతో రేపటిపత్రిక కథల పోటీకి ఓ కథ రాస్తారారాయరా- చెప్పండి?

భర్త: సారీ! వెరీ వెరీ సారీ!

భార్య: రాయరా?

భర్త: ఏమిటలా గద్దిస్తున్నావు? రాయకపోతే ఏం చేస్తావేమిటి?

భార్య: మీరూ, మీ చెల్లెలూ మా తమ్ముడితో ఆడుతున్న నాటకం వాడితో చెప్పేస్తాను.

భర్త: సొంత తమ్ముడైతే మరీ యిదయిపోదువు.

భార్య: సొంతం కాకేం. పిన్నమ్మ కొడుకైతేనేం, తమ్ముడు తమ్ముడే. ఆమెకు పోటీలో ఒక బహుమానం రాగానే పాపం వాడు మహాగొప్ప రచయిత్రి అనుకుని మోజులో పడ్డాడు. అలాంటి వెర్రి బాగుల వాళ్ళ మోజులు చూసే మీరు చేతుల మీదుగా మీ చెల్లెలినో రచయిత్రిని చేసి పారేసి అతన్ని ప్రలోభ పెట్టి కట్నం గిట్నం లేకుండా పెళ్ళి చేసేదా మనుకుంటున్నారు.

భర్త: ఛ ఛ- కథకుడికి తగిన పెళ్ళానివి కావు నువ్వు.

భార్య: అవునవును. పెళ్ళయ్యేదాక ప్రేయసిని. అయ్యాక రాకాసిని నేను. మీకు కూడా మీ చెల్లెమ్మ లాగు కథలు రాస్తూ వుండే దొకర్తె దొరికి వుంటే అప్పుడు తెలిసొచ్చును అయ్యగారికి. ఇద్దరూ రోజస్తమానం చెరో కలం-కాయితం పుచ్చుకొని కథలు బరుకుతూ కూచుంటే దినం దిబ్బ చేరినట్టే" అని గిరుక్కున వంటింట్లోకి జర్రిలా వెళ్ళి పోయింది కాంతమ్మ.

ఆవేళ సాయంకాలం ఊళ్ళో లలిత సాహితీ సమితి ఆధ్వర్యంలో కుమారి ప్రఫుల్లకు ఘనమైన సన్మానం ఏర్పాటు చెయ్యబడింది. సన్మాన సభాధ్యక్షుడు సుప్రసిద్ధ కథ కుడు ప్రభాకరంగారే.

ప్రఫుల్ల ముస్తాబవుతూ "ఏం వొదినా ఇంకా అలాగే కూర్చున్నావు. కారొచ్చే వేళయింది. మరి లెండి. ఇవాళ మీరు కాశ్మీరు సిల్కు చీర కట్టుకోవాలి."

"మధ్య నా కెందుకమ్మా ఈ డాబూలూ ముస్తాబు లూనూ. కడుపునో కాయ గాయకపోయినా కాలం మళ్ళి పోతున్నదాన్ని" అని బుంగ మూతి పెట్టింది కాంతమ్మ.

"అదేంటొదినా- ఈ సన్మానానికి మీరు రాకపోవడం నాకేం బాగాలేదు."

"ఏమో నమ్మా, నేనేం కథలు రాసిందాన్నా, కావ్యాలు రాసిందాన్నా-సభలకీ సన్మానాలకీ ఎగబట్టానికి. నాకేం మీకు మల్లే హారాలు వేస్తారా, హారతులిస్తారా అక్కడ? నా కాలం నాడు కులమింట ఆడకూతుళ్ళిలా మగ మహారాజుల సభల్లో సిగ్గూ లజ్జా విడిచి చిందులు తొక్కడ మెరుగుదుమా? మాకేం చదువా-చట్టు బండలా? నక్కుంటే బియ్యే పేసయినదానివి. ఏ ఇంద్రుణ్ణో-మహేంద్రుణ్ణో, కట్టుకొని స్వర్గాన్నేలవలసిందానివి..."- ఇలా వెళ్ళిపోతోంది కాంతమ్మ ధోరణి నయాగరా జలపాతంలా. మధ్యలోనే మరి వినలేక వెళ్ళిపోయింది ప్రఫుల్ల. అన్నగారితో చెప్పింది.

"అది అంతేలే! పద కారెక్కు" అన్నారు ప్రభాకరం గారు.

సన్మానమై పోయి యింటి కొచ్చేసరికి తలుపు దగ్గర దిష్టి ముంత పట్టుకుని నిలుచుంది కాంతమ్మ. లోపలికి వస్తూనే "ఇదేమిటని " ముఖం చిట్లించుకున్నారు ప్రభాకరంగారు.

"మరేం లేదు- సభలో పిల్లకి దిష్టి తగిలుంటుంది. కాస్త వసంతం దిగ దుడిచి పారబోద్దామని" అని ఠంచనుగా అంది కాంతమ్మ.

"ఇందాక వేసిన అక్షింతలు చాల్లేండి" అంటూ ఈ వెటకారం మరి భరించ లేక సరాసరి తన గదిలోకి వెళ్ళి

అలాగే మంచం మీద పడి వెక్కి వెక్కి యేడవడం మొదలెట్టింది ప్రఫుల్ల.

ఆర్చేవారెవరు? తీర్చేవారెవరు? తల్లిదండ్రి చిన్నప్పుడే పోయారు! అన్నిటికీ అన్నగారే ఎన్నని చూసుకుంటాడు ఆయన మాత్రం. ఇంతకీ సభకి వస్తానన్న మహేంద్ర రాక పోతే అన్నగారేం చేస్తాడు. వదిన గారి ధోరణి కంటే మహేంద్ర సభకు రాకపోవడానికి చాలా మధన పడింది ప్రఫుల్ల.

మర్నాడు సాయంకాలం ప్రభాకరంగారు ఆఫీసు నుంచి వచ్చేసరికి ప్రఫుల్ల మళ్ళీ ఏడుస్తూ కనిపించింది.

"ఏమమ్మా ఇంకా నిన్నటిదానికే అలా ఏడుస్తూ కూర్చున్నావా? మళ్ళా గాని ఏమన్నా అన్నదా మీ వదిన? దాని సంగతి నీకు తెలిసిందేగా! ఎలాగో మరి కొద్ది రోజులు ఓపిక పట్టావంటే శచీదేవిలా హాయిగా వుంటావు" అని ప్రభాకరంగా రంటూవుండగా ప్రఫుల్ల అతని చేతికో వుత్తరమిచ్చి దోసిట్లో ముఖం కప్పుకుంది.

ప్రభాకరంగారు ఆత్రుతగా ఉత్తరం విప్పి చూశారు. ఆయన గుండెలా చేతిలోంచి ఉత్తరం జారిపోయింది. ఆయన కుప్ప కూలిపోలేదు గాని, కంపించిపోయారు.

"నీ కథలను బట్టే నిన్ను ప్రేమించాను నేను. అవి నీవి కావని తెలిసిపోగానే ......

'హు అనభిజ్ఞుడు! ఎంత అలప స్వభావుడు, ఎంత మాటన్నాడు!' అని యేదో తట్టినవాడిలా లేచాడు. లేచి సరా సరి వంచాదిలోకి వెళ్ళి సొరకాయ కోస్తున్న కాంతమ్మను- "ఏమే దౌర్భాగ్యురాల! ఇది నీ పనేనా?" అని గద్దించాడు మహేంద్ర వ్రాసిన ఉత్తరం చూపిస్తూ.

"ఇదేమిటి! ఈ ఉత్తరం సంగతి నాకేం తెలుసు" అంది కాంతమ్మ నంగనాచిలా.


"అవును వాడి ఉత్తరం సంగతి నీకేం తెలుస్తుంది? ఉత్తరంలో నీ సంగతి వాడు తెలిపాడు"

"అవ్వ! ఎంత పని చేశాడు! ఏదో మా పిన్నమ్మ కొడుకుగదా అని వాడి మంచికి చెబితే నా పరువే బైట పెడతాడా?" అని నోరు నొక్కుకుంది.

"నీకు పరువన్న దొకటి వుంటేగదా వాడు బైట పెట్టడానికి. నువ్వే ఇంటి పరువు తీసేశావు."

"నేనేం చేశాను. నేను వాడితో చాడీలు చెప్పానా? ఫిర్యాదులు చేశానా? ఉన్న సంగతే చెప్పాను."

"ఏమిటే ఉన్న సంగతి! నీకు ప్రఫుల్ల మీద వున్న అసూయా, అక్కసూ అంతా తీర్చుకున్నావు. శకుంతల మీద వున్న అక్కసు గూడా దీనిమీదే చూపించావు. అది వ్రాసిన ప్రతి కథలోను వస్తువు తాను స్వతంత్రంగా ఊహించుకుని రాసిందే. కాక పోతే రచన విషయంలో నాతో కాస్త సంప్రదించేది.. రాను రాను అదే నాకన్నా బాగా చేస్తోంది రచన. నేను ఊళ్ళో లేనప్పుడు ఎన్ని కథలని స్వతంత్రంగా వ్రాసి నీకు వినిపించింది కాదు? నువ్వు మహేంద్రతో చెప్పిన విషయం నీ మనసారా నిజమని నమ్మే చెప్పావా? కలిసొచ్చిన సంబంధం చేజేతులా కాల్చేశావు కాని హృదయం ఎలా క్షోభించిపోతుందో చూడు. నీ కడుపు పండలేదు. నీకు బిడ్డలు లేరు గాని దాని హృదయం పండింది దానికున్నారు. దాని కథలన్నీ దాని మానసిక పుత్రికలే. దానికి తెలుసు- మనుషుల మమతలూ, బాధలూ ఎలాంటివో. నీకేం తెలుసు



పుత్త గొడ్డువి!" అని నాటకంలో మంచి ఉద్రిక్త పాత్ర చేత ఉపన్యాసం చెప్పించినట్లు చెప్పేస్తున్నాడు ప్రభాకరం గారు- ఆ మాట లావిడ కర్థమవుతాయో లేదో గమనించకుండా.

ఆవిడ కిక్కురుమనకుండా గోళ్ళు గిల్లుకుంటోంది. "ఏభయ్యేళ్ళ జీవితంలో నీతో ముప్పైయ్యేళ్ళ కాపురంలో ఇప్పటికి నేను చచ్చీ చెడీ కూడబెట్టగలిగింది అయిదు వేలు. అమ్మా నాన్నా ప్రఫుల్ల బాధ్యతంతా నా చేతి మీద అప్పగించి వెళ్ళిపోయారు. దానికింత చదువూ సంస్కారమూ ఇచ్చి, దాన్నో యింటిదాన్ని చెయ్యాలని చూస్తున్నాను. ఈ అయిదు వేలు పెట్టి దాని కేదో ఒక సంబంధం తేలేక కాదు. పోనీ మంచి సంబంధం కాళ్ళ దగ్గర కొచ్చింది, వాడేదో బాగా వున్నవాడు- మోజుపడి వచ్చాడు! కట్నం డబ్బులు కలిసొస్తాయి- ఈ అయిదు వేలూ నీ పేరనే బేంకిలో వెయ్యొచ్చు అను కుంటే ఇలా చేశావు."

"అయ్యో అయ్యో! ఈ అయిదు వేలూ మిగులుతాయన్న ఊహే పోయిందిగదండి నాకు. ఎంత పని చేశాను పాపిష్టి దాన్ని" అని నోరు నొక్కుకుంది.

అక్కడ నుంచి ప్రభాకరంగారు గిరుక్కున మళ్ళా వీధిలోకి వెళ్ళిపోయారు. జాము రాత్రికి ఇంటికి చేరారు. ఎంగిలి పడలేదు. మండువాలో మంచం వేసుకుని రాత్రంతా ఆకాశంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తూనే గడిపారు. ప్రొద్దున్నే కాస్త కాఫీ మాత్రం తీసుకొని చరచర ఒక కథ రాసి ఆ మధ్యాహ్నం టపాకే పంపేశారొక పత్రికకి.

కథ పేరు 'కథావశేషులు' కథంటే కథ కాదు- యదార్థమే అంతా. ఆ సన్నివేశమే ఉన్నదున్నట్లు ఉదాత్తంగా, హృదయంకషంగా చిత్రించారు. వారం రోజుల్లో కథ



పత్రికలో పడింది. ప్రభాకరం గారనుకున్నట్లే జరిగింది. అది మహేంద్ర కంట పడింది. అతని హృదయం ఉడుకెత్తి పోయింది. పశ్చాత్తాపంతో పాపం సరాసరి మర్నాడే ప్రఫుల్ల పాదాల దగ్గర వ్రాలేడు. క్షమించమని ప్రాధేయపడ్డాడు. కాంతమ్మ ఎదురుగా వచ్చి ఏడుపు మొఖం పెట్టి లెంప లేసుకుని వెళ్ళిపోయింది.

"నా కథా రచన విషయంలో నే నెన్నడూ నీతో అబద్ధా లాడలేదు. ఉన్న దున్నట్లు చెప్పాను. నాకు బహుమానం వచ్చిందని నువ్వు నీ చేత్తో పత్రిక పట్టుకు వచ్చిన రోజున నేనన్న మాటలు గుర్తుకు తెచ్చుకో. ఏం-నీ అపోహ తీరింది గదూ" నిదానంగా ఎత్తుకుంది ప్రఫుల్ల.

"తీరిపోయింది"

"అవును- అది చెప్పడు మాటల వల్ల ఏర్పడిన అపోహ. కాని 'నీ కథలను బట్టే నేను నిన్ను ప్రేమించాను' అన్నది నీ పుర్రెకు పుట్టిన అభిప్రాయం."

"కాదు ప్రఫుల్లా నేను మనసారా నిన్ను ప్రేమిస్తున్నాను."

"నిజం!"

"ముమ్మాటికీ నిజం. అపోహను నిజమనుకున్నప్పుడు నిజమైనది అబద్ధం అని చెప్పడానికో కుంటిసాకును వెతుక్కోవలసి వచ్చింది. నువ్వు 'ఊ' అంటే రేపే మన పెళ్ళయి పోతుంది."

"ఆ-నువ్వు నా కొక్క మాటివ్వగలవా?"

"తప్పక. అదేదో నువ్వు చెప్పకుండానే మాటిస్తున్నాను"

"ఈ జన్మలో మరి నువ్వు నన్నెప్పుడూ ద్వేషించనని మాటియ్యాలి"

"మళ్ళా నిన్ను ద్వేషిస్తానా ప్రఫుల్లా?"

"సరే- మరి నువ్వు వెళ్ళవచ్చు. నేను పెళ్ళి చేసుకోను" అంది తీర్పు చెప్పినట్టు.

నిర్ఘాంతపోయాడు మహేంద్ర.

ఇంతలో ప్రభాకరం గారు వచ్చారు.

ఇద్దరూ ఉలుకు పలుకు లేదు. హృదయాలు మాత్ర మూగిసలాడుతున్నాయి. వారి గాఢ మౌన గంభీర ముద్రిత వాతావరణ మంతా నిశ్శబ్ద నీరసంగా వుంది.

ప్రభాకరంగా రాశ్చర్యచకితులై "ఏమిటీ సస్పెన్సు" అన్నారు.

మహేంద్ర సవినయంగా సంగతంతా విన్నవించి "బావ గారూ! తగిన ముగింపు లేకుండా నా కథ ఇలా అధ్వాన్నంగా వుండిపోవలసిందేనా? ఇక మీరే వడపోసి కథను" అని ముగించాడు.

ప్రఫుల్ల ముఖంలో మందహాస వికాసం కనిపెట్టి-

"కాంతం! కాసిన్ని అక్షింత లందుకోవే" అన్నారు ప్రభాకరం గారు.

